## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర, లష్కర్ సింగారం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### కిరణ్మయికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం పరిశోధకురాలు జె.కిరణ్మయికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్టడీస్ ఆన్ క్యారెక్టరైజేషన్ అండ్ యాంటీ మైక్రోబియల్ యాక్టివిటీ ఆఫ్ యాక్టినోమైసెట్స్ ఐసోలేటెడ్ ఫ్రమ్ రిజోస్పైర్ సాయిల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కిరణ్మయికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో కిరణ్మయి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

### నగిషీ కళాకారుడు మృతి


బాలరాజు (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటకు చెందిన నగిషీ కళాకారుడు చిమ్మని బాలరాజు (70) అనారోగ్య సమస్యలతో గురువారం ఉదయం మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. బాలరాజు మృతదేహాన్ని కార్పొరేటర్ గుండు చందన్, స్థానికులు పూర్ణచందర్, గుండు బాబురావు, మండల పరశురాములు, కొంతం మోహన్, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు.

### ఏకగ్రీవంగా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


కోడెల మురళి

హసన్‌పర్తి: మాస్టర్ క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కోడెల మురళి, ఉపాధ్యక్షుడిగా బోయిని శశికాంత్, ప్రధాన కార్యదర్శిగా వల్లాల యుగంధర్, సహాయ కార్యదర్శిగా పప్పుల మోహన్, కోశాధికారిగా దయాకర్, ఉప కోశాధికారిగా తిరుపతి, సభ్యులుగా కాజీపేట శ్రీనివాస్, కనపర్తి రాజు, శీలం క్రాంతి, వెల్గిటి వెంకన్న, శీలం వంశీ, వేల్పుల సాయికుమార్, సలహాదారులుగా సురేష్, గోపి, సతీష్ ఎన్నికయ్యారు.

### వేయిస్తంభాల దేవాలయంలో సినీ గేయ రచయిత పూజలు




హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయాన్ని తెలుగు జానపద, సినీ గేయ రచయిత ఉద్యమకారుడు మిట్టపల్లి సురేందర్ తన బృందంతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సురేందర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కుమార్ మాదిగ, నరేష్ మాదిగ, వేద పండితుడు గంగు మణికంఠ, అర్చకుడు సందీప్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### జగ్జీత్ దల్లేవాల్ దీక్షకు మద్దతు

హన్మకొండ: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు సంఘ నాయకుడు జగ్జీత్ దల్లేవాల్, రైతులు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మద్దతు తెలుపుతున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలకుర్తి కృష్ణమూర్తి, తూపురాణి సీతారాం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని జగ్జీత్ దల్లేవాల్ 50 రోజులుగా చేస్తున్న దీక్షను విరమింపజేయాలని వారు ఒక ప్రకటనలో కోరారు. ఆయనకు ఏదైనా జరిగితే నరేంద్రమోదీ బాధ్యత వహించాల్సి వస్తుందని, ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



హసన్‌పర్తి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హసన్‌పర్తికి చెందిన చెన్నూరి రాజమౌళి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే నాగరాజు వెంట కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పీసం సురేందర్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్లు జె.రవి, బల్సుకూరి శ్రీనివాస్, నాయకులు శీలం రమేష్, నర్సింహారాములు, ఆనంద్, సాంబయ్య తదితరులు ఉన్నారు.

# నిరుపయోగంగా మార్కెట్లు

- ఉపయోగంలోకి రాని మాంసం, చేపల దుకాణాలు
- రూ.30 లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా మారిన కాంప్లెక్స్


అడ్డాలు కేటాయించని చేపల మార్కెట్


అలంకారప్రాయంగా ఉన్న దుకాణ సముదాయం

కాజీపేట: అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా మారింది కాజీపేట పట్టణవాసుల పరిస్థితి. అధికారుల పట్టింపులేనితనం వల్ల మాంసం, చేపల వ్యాపారుల కోసం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ అయిదేళ్లుగా నిరుపయోగంగా ఉంటోంది. కాజీపేట చౌరస్తాకు కూతవేటు దూరంలో వ్యాపారుల సౌకర్యార్థం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన దుకాణాలు గ్రేటర్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్రమేణా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

**వ్యాపారులకు కేటాయించకపోవడంతో..**

రహదారులకు ఇరువైపులా చేపలు, మాంసం విక్రయిస్తున్న వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా సకల సౌకర్యాలతో కాంప్లెక్స్ నిర్మించారు. అయితే, అసలు సమస్య అంతా ఇక్కడి నుంచే మొదలైందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిధులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేసి నిర్మించిన భవనాలను సకాలంలో వ్యాపారులకు గ్రేటర్ అధికారులు కేటాయించకపోవడంతో వృథాగా పడి ఉంటున్నాయి. ఇంకా పలువురు వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ రహదారులపై ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. బాపూజీనగర్ ప్రధాన రహదారిపై చేపల మార్కెట్‌ను ఈ కాంప్లెక్స్‌లోకి తరలించకుండా అధికారులు కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తోంది. మాంసం వ్యాపారుల కోసం నిర్మించిన అడ్డాలను వెంటనే కేటాయించాలంటూ గ్రేటర్ సర్కిల్ కార్యాలయం ఎదుట పలువురు ఆందోళనలు చేసి వినతి పత్రాలు ఇస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుకాణాలను కేటాయించాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

**అడ్డాలు కేటాయించాలి**



ప్రభుత్వ నిధులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేసి నిర్మించిన అడ్డాలను వెంటనే మాంసం, చేపల వ్యాపారులకు కేటాయించాలి. రహదారుల పక్కన దుకాణాలు ఉండటం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మార్కెట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి.

\- సుంచు చిన్న అశోక్, కాజీపేట

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలి


లేఖలు ప్రదర్శిస్తున్న వేదిక ప్రతినిధులు

హన్మకొండ: హనుమకొండ 57వ డివిజన్ పరిధి లష్కర్ సింగారం రెవెన్యూ పరిధి 266 సర్వే నంబర్‌లోని 7 ఎకరాల 36 గుంటల స్థలంలో సీఎం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక అధ్యక్షుడు తుపాకుల దశరథం, వేదిక సభ్యులు కోరారు. హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీలోని శ్యామల గార్డెన్‌లో ప్రజాతంత్ర ఆలోచన వేదిక సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతీరోజు ముఖ్యమంత్రి కార్యాలయానికి 10 లేఖల చొప్పున పంపాలని నిర్ణయం తీసుకుని 10 లేఖలు పోస్టు చేశారు. లష్కర్‌సింగారం రెవెన్యూ పరిధిలో మార్కెట్ ఏర్పాటు చేస్తే నాలుగు డివిజన్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించి ప్రహరీ ఏర్పాటు చేయాలని ఆర్డీఓను కలిసి అనేకసార్లు విన్నవించినా స్పందన లేదని వాపోయారు. సమావేశంలో వివేక్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, శ్యామల దుర్గాదాస్ కాలనీ అధ్యక్షుడు డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ప్రజాతంత్ర ఆలోచన వేదిక ఉపాధ్యక్షుడు మీసాల రమేష్, ప్రోగ్రామ్స్ కన్వీనర్ పింగిలి అశోక్ రెడ్డి, ప్రతినిధులు బుర్ర విజయపాల్, జె.సారంగపాణి, గూడెం రమేష్, తంగళ్లపల్లి శంకరాచారి, రాంపల్లి రాజప్రభు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో గురుకుల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపుల బకాయిలు ఉన్నాయని అన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించి, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్ పరిమళ, జిల్లా సహాయ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్: సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటుకు అర్హత కలిగిన గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోడుభూముల హక్కు పత్రాలు కలిగి ఉన్న గిరిజన రైతులు ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షపవం ఉత్సవ్ మహాభియాన్(పీఎం కుసుము) పథకంలో లబ్ధి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి సబ్‌స్టేషన్ నుంచి 5 కిలోమీటర్ పరిధిలోని గిరిజన రైతులు ఈనెల 19వ తేదీలోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. గిరిజన రైతులు తమ భూములకు స్వయం సహాయక సంఘాల ద్వారా లీజు కౌలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్ 96523 69090లో సంప్రదించాలని సౌజన్య కోరారు.

## కార్మిక భవన పునర్నిర్మాణానికి ఉద్యమం


పోస్టు కార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు

వరంగల్: ఆజంజాహి మిల్ కార్మికుల భవన నిర్మాణం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డుల ఉద్యమం చేపడుతున్నట్లు మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆజంజాహి మిల్ కార్మిక భవన్ స్థల పరిరక్షణ అఖిలపక్ష కమిటీ సమావేశం ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ అధ్యక్షతన కాశిబుగ్గలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా సీఎంకు రాసిన పోస్టు కార్డుల కార్యక్రమాన్ని రచయిత ప్రొఫెసర్ రామా చంద్రమౌళి ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన పోస్టు కార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మా నాన్న కార్మికుడు గ్రూప్ కన్వీనర్ ఆకెన వెంకటేశ్వర్లు, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్, బీజేపీ నాయకుడు సముద్రాల పరమేశ్వర్, కార్మికుల కుటుంబ సభ్యులు గంజి సాంబయ్య, జి.రవి, నగేష్, చిమ్మని గోపి, అజయ్, బొప్పరాతి రమేష్, రామాభాస్కర్ పాల్గొన్నారు.

## సైకిల్ వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న గోపాల్‌రెడ్డి, బాధ్యులు

విద్యారణ్యపురి: సైకిల్ వాకర్స్ అసోసియేషన్ వరంగల్ శాఖకు అవార్డు లభించింది. 2024వ సంవత్సరంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ ప్రాంతంలో స్వచ్ఛభారత్, హరితహారం, పర్యావరణ పరిరక్షణ, వాయు, జల కాలుష్య నివారణ, ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం, వృద్ధాశ్రమాలకు చేయూత ఇవ్వడం లాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకు అసోసియేషన్ వరంగల్ శాఖకు ఇటీవల ఏలూరులో నిర్వహించిన కన్వెన్షన్‌లో అవార్డును వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రదానం చేసింది. రూ.5 వేల విలువగల చెక్కును అందజేసి అభినందించారు. ఈమేరకు హనుమకొండలో అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అధ్యక్షతన బాధ్యులు గురువారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రమేష్, బాధ్యులు వేణుగోపాల్, సత్యం, రవిరాజు, సురేందర్, రాపర్తి లక్ష్మయ్య, శేఖర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం స్వాధీనం



హసన్‌పర్తి: అక్రమంగా తరలిస్తున్న రూ.75 వేల విలువైన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి పద్మశాలి కాలనీ నుంచి అంబాల్ వైపునకు టాటా ఏస్ వాహనంలో తరలిస్తుండగా 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ రాజును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై దేవేందర్ వివరించారు.

## క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం


మాట్లాడుతున్న వీరన్న

కాజీపేట రూరల్: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ బి.వీరన్న, రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ ఆర్.రమేష్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ రిపబ్లిక్ డేను పురస్కరించుకొని ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌కు కాజీపేట, వరంగల్, బెల్లంపల్లి, డోర్నకల్, కొండపల్లి, భద్రాచలం, ఆలేరు, సికింద్రాబాద్ ప్రాంతాల నుంచి 21 జట్లు పాల్గొన్నాయని వివరించారు. ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, కల్చరల్ విభాగాల ఇన్‌చార్జ్ ధావత్ రఘు, క్రికెట్ క్రీడల ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, కమిటీ సభ్యులు ఎస్.ప్రవీణ్, పి.రవికిరణ్, సుంచు ప్రశాంత్, రైల్వే నాయకులు పి.అనిల్‌కుమార్, కంచు రాజు, అశోక్ పాల్గొన్నారు.

## సదస్సును విజయవంతం చేయాలి


నినాదాలు చేస్తున్న ఉద్యమకారులు

వరంగల్: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం వరంగల్ మండల అధ్యక్షుడు కందగట్ల మోహన్ పిలుపునిచ్చారు. ఆరెపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేపడుతున్న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారులు బుద్దె శ్రీనివాస్, వెంకన్న, రాజేశ్వర్‌రావు, జనగాం కుమారస్వామి, రవీందర్, కుమార్, రాజు పాల్గొన్నారు.

### మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మడికొండ: ఓ మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ ఎస్‌హెచ్‌ఓ కిషన్ తెలిపారు. కాజీపేట మండలం కడికొండ గ్రామానికి చెందిన మేకల చంద్రమౌళి.. కడిపికొండలో సాదినేని సుజాత ఇంటిపక్కన పాత ఇల్లు కొనుగోలు చేశాడు. ఇంటి ముందు ప్రహరీ విషయంలో సుజాతతో చంద్రమౌళి గతంలో గొడవ పడ్డాడు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఈక్రమంలో పెద్ద మనుషులపై చంద్రమౌళి దుర్భాషలాడగా, వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా కూడా అతనిలో మార్పు రాలేదు. గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద పని చేసుకుంటున్న సుజాతపై చంద్రమౌళి ఇటుకతో దాడి చేయగా ఆమె తలపై తీవ్ర గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చంద్రమౌళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

## రేపు త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం


మాట్లాడుతున్న భద్రకాళి శేషు

నయీంనగర్: విద్యారణ్య శ్రీ ఆర్షధర్మ రక్షణ సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవాన్ని హనుమకొండ బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో శనివారం నిర్వహించనున్నట్లు బ్రహ్మశ్రీ భద్రకాళి శేషు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యలో శతక సాహిత్యం పిల్లలకు నేర్పించడం ద్వారా వారి జీవన విధానంలో క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. సమావేశంలో ఆచార్య తిరుపతయ్య, సూత్రపు అభిషేక్, వెలగందుల భాస్కర్, ఉమ్మడి లక్ష్మణాచారి, నీరజ, జియాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ఫిబ్రవరి 24, 25వ తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, జువాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ గురువారం ఆవిష్కరించారు. ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ఇన్ యానిమల్ బయో టెక్నాలజీ అండ్ ఇమ్యునాలజీ ఫర్ డిసీస్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య వివరించారు. కార్యక్రమంలో జువాలజీ విభాగం ప్రొఫెసర్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ఖిలా వరంగల్: ఆటో డ్రైవర్లు సామాజిక బాధ్యతగా వాహనం నడిపి ప్రమాదాల నిర్మూలనకు పాటుపడాలని ఎంవీఐలు జైపాల్‌రెడ్డి, శోభన్‌బాబు సూచించారు. జాతీయ రోడ్డు రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. అతివేగంతో వాహనాన్ని నడపడమంటే ప్రమాదాలు కొని తెచ్చుకోవడమేనని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాన్ని నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎంవీఐలు హెచ్చరించారు.

## ప్రొఫెసర్ జ్యోతి మృతికి సంతాపం


మౌనం పాటిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆర్ట్స్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి ఇటీవల మృతి చెందారు. ఆమె మృతికి సంతాపకంగా పరిపాలన భవనంలో బోధన, బోధనేతర ఉద్యోగులు గురువారం రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సీడీసీ డీన్ రాంచంద్రం, కేయూ పాలక మండలి సభ్యులు సురేష్‌లాల్, డాక్టర్ రమ, డాక్టర్ చిర్ర రాజు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



### అధిక లోడు.. ప్రమాదకరం

నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో టాటా ఏస్ వాహనాలు కాజీపేట చౌరస్తా నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పొరపాటున వాహనం పట్టు తప్పితే ఇతర వాహనదారులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఇలాంటి వాహనాలపై చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

\- కాజీపేట

## ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న షబ్బీర్‌అలీ

న్యూశాయంపేట: మైనార్టీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ అన్నారు. హైదరాబాద్‌లో టీఎస్ మేసా (తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోషియేషన్) హనుమకొండ జిల్లా శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై షబ్బీర్‌అలీకి నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్‌డీ.నన్నేసాహెబ్, ప్రధాన కార్యదర్శి ఎండీ.గౌస్‌పాషా, రాష్ట్ర కోఆర్డినేటర్లు ఎంఏ.అజీజ్, జుబేదా, రాజ్‌మహ్మద్, మంజూర్ అహ్మద్, ఫక్రొద్దీన్, జిలానీపాషా, మదార్‌సాహెబ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ప్రత్యేక నిఘా


తాళం వేసిన ఇల్లును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్

ఖిలా వరంగల్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఊరెళ్లిన వారి ఇళ్లపై మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. 'సంక్రాంతికి ఊరెళ్తున్నారా..? అయితే, మీ ఇల్లు భద్రంగా ఉండాలంటే నాకు సమాచారం ఇవ్వండి' అంటూ ఇన్‌స్పెక్టర్ కోరారు. దాంతో ఊరెళ్తున్న వారు ముందుస్తుగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. ఆ ఇళ్లను ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం పగలు, రాత్రి వేళల్లో పరిశీలించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



వరంగల్: కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన చెన్నూరి వెంకటేశ్వర్లుకు బుధవారం రాత్రి ఫిట్స్ రావడంతో మృతి చెందారు. అతడి తండ్రి పదేళ్ల క్రితం, తల్లి రెండు నెలల క్రితం చనిపోగా వికలాంగుడైన తమ్ముడు మాత్రమే ఉన్నాడు. వరంగల్ జిల్లా హోల్‌సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్ కమిటీకి చెందిన ప్రతినిధులు రూ.10 వేలను దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బిట్ల కృష్ణ, కొండా హరి, నమిండ్ల సూరయ్య, సర్వర్, బూర ప్రకాష్, రమేష్, హరీష్, రాజు పాల్గొన్నారు.